

జిల్లా క్రైం ఏఎస్పీగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 30: జిల్లా క్రైం అదనపు ఎస్పీగా పాత్రుని శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్రంలోని 34 మంది డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లా క్రైం అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఎస్‌బీ డీఎస్పీగా శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తున్న ఎ.త్రినాథరావును మంగళగిరి పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

30 ఏళ్లుగా నరకం



ఉప్పరిపేట గ్రామం

- వెళ్లేందుకు రోడ్లు లేవు.. తాగేందుకు నీరు లేదు
- ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులు
- నది చెంతనే ఉన్నా తప్పని సాగునీటి ఇబ్బందులు
- ఇదీ ఉప్పరిపేట, డోలపేట గ్రామాల పరిస్థితి

ఆ గ్రామాలకు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఇరుకైన మట్టి రోడ్లే దిక్కు. 104, 108 అంబులెన్స్‌లు వెళ్లడం గగనం. రాత్రి సమయంలో ఏ అత్యవసరం వచ్చినా జీడితోటల్లో మట్టి రోడ్ల మీదుగా రెండు కిలోమీటర్లు పరుగులు పెట్టాల్సిందే. తాగునీటి పథకం మొరాయిస్తే వంశధార బురద నీరు వడకట్టి తాగాల్సిందే. ఇది ఎక్కడో కొండలు, అరణ్యాల్లో అనుకుంటే పొరపడినట్టే. నరసన్నపేట మండలం మడపాం జాతీయ రహదారికి 7 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఉప్పరిపేట, డోలపేట గ్రామస్థుల కష్టాలు ఇవి.

(నరసన్నపేట)

నరసన్నపేట మండలంలోని ముషిడిగట్టు పంచాయతీ పరిధిలో ఉప్పరిపేట, డోలపేట గ్రామాలు ఉన్నాయి. ఉప్పరిపేటలో 80 కుటుంబాలు, డోలపేటలో 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామాల్లో అధిక శాతం వ్యవసాయ కూలీలు, చేపలు పట్టే నెయ్యల కులస్థులు ఉన్నారు. ఈ రెండు గ్రామాలు వంశధార నదీ తీరాన ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన మట్టి రోడ్లే దిక్కు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పరిపేటకు వెళ్లాలంటే మడపాం నుంచి లుకలాం మార్గంలో మడపాం ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే ఉన్న రోడ్డులో వెళ్లాలి. సుమారు కిలోమీటరు మేర ఇరువైపులా జీడితోటల్లో ప్రయాణించాలి. అక్కడ నుంచి మరో కిలోమీటరు మట్టి రోడ్డున వెళ్లాలి. వర్షాకాలంలో అయితే ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే. ద్విచక్ర వాహనాలతో వెళ్లాలంటే పీట్లు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పోనీ లుకలాం నుంచి వెళ్దామంటే చిన్నమార్గమని, వాహనాలు వచ్చేందుకే వీలు లేదని ఆవేదన చెందుతున్నారు. వంశధారకు వరద పోటెత్తితే ఈ గ్రామాల్లోకి నీరు వచ్చేస్తుంది. తాగునీటి కోసం నిత్యం కొళాయిల మీద ఆధారపడుతున్నారు. గ్రామంలో ఎక్కడ బోరు కానీ, బావి కానీ తవ్వినా ఉప్పునీరు, చప్పటి నీరు పడుతుందని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. లుకలాం రక్షితనీటి పథకం నుంచి అరకొరగా తాగునీరు వస్తుండడంతో ఏరు(నది)నీరు మీద ఆధారపడుతున్నారు. ఏరు నీటిని బిందెల్లో తీసుకువచ్చి బిందెకు అడుగుభాగాన ఇండిక పిక్కను రాసి నీటిని వడబోసి తాగుతున్నట్లు చెబుతున్నారు. వంశధార చెంతనే ఉన్నా సాగునీరు మాత్రం ఆ గ్రామాలకు రాదు. దీంతో ఏటా పంటలు ఎండిపోయి నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మడపాం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలో రావడంతో ఎత్తిపోతల పథకం అటకెక్కింది. మళ్లీ ఎన్నికల ముందు హడావుడి చేసినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.



ఉప్పరిపేట- డోలపేట గ్రామాల మధ్య రోడ్డు



లుకలాం వెళ్లేందుకు ఈ మట్టి రోడ్డే గతి

చదువులకు దూరం..

డోలపేట, ఉప్పరిపేట గ్రామాల్లో ఉన్నత చదువులు చదివిన వారు చాలా తక్కువ. ఈ గ్రామా ల్లోని పిల్లలు ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు ఉప్పరిపేటలో ఉన్న పాఠశాలలో చదువుతుంటారు. ఆరు నుంచి పదో తరగతి వరకు మూడు కిలోమీటర్ల దూరంలోని లుకలాం పాఠశాలకు వెళ్లి చదువుతుంటారు. ఇంటర్మీడియట్, ఆపై చదువుల కోసం నరసన్నపేట, శ్రీకాకుళం వెళ్లాల్సిందే. అయితే, సరైన రోడ్లు లేక, తోటల్లో కాలినడకన వెళ్లలేక, వర్షాకాలంలో విషపురుగుల భయంతో చాలామంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. కొందరు విద్యార్థులు మాత్రం వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని ఆ రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు రావడం, తమ గ్రామాలకు విశాలమైన రోడ్లు వేస్తాం, అభివృద్ధి చేస్తామని చెప్పడం పరిపాటిగా మారిందని అంటున్నారు. వారు గెలిచిన తరువాత ఈ ఊళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా ఇవే మాటలు వింటున్నామని, అభివృద్ధిపై ఆశలు పోయాయని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.



చిన్నతనం నుంచి ఇలాగే ఉంది..

నా చిన్నతనం నుంచి చూస్తున్నాను. మా ఊరు ఇలాగే ఉంది. అప్పట్లో పొలం గట్ల మీదుగా వచ్చే వాళ్లం. గత 30 ఏళ్లుగా మట్టి రోడ్ల మీద వస్తున్నాం. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. రోగం వస్తే ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా రోడ్డును అభివృద్ధి చేయాలి.

-రైతు అప్పన్న, ఉప్పరిపేట

నీటికి కష్టాలు పడుతున్నాం..



మా రెండు గ్రామాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి హామీలు ఇస్తున్నారు. గెలిచిన తరువాత మరచిపోతున్నారు. ఇలా జీవించేందుకు అలవాటు పడ్డాం.

-రైతు నాయుడు, ఉప్పరిపేట

పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యత

- జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పనిచేద్దాం
- మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి, ఆగస్టు 30: పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి మంత్రి అచ్చెన్న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 21 శాతం పచ్చదనం ఉందని, రానున్న ఐదేళ్లలో దీనిని 50 శాతానికి పెంచడమే లక్ష్యమని తెలిపారు. దీనికోసం 30లక్షల మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. పుట్టినరోజు, వివాహ దినోత్సవం వంటి సందర్భాల్లో గుర్తుగా ఒక మొక్కను నాటి సంరక్షించడం అలవాటుగా చేసుకోవాలి. దీనిద్వారా భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత జిల్లాను అందిద్దాం. ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతీ గ్రామంలో మూడు రోజుల పాటు కేవలం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి. పలాస కాశీబుగ్గ ప్రాంతంలోని 200 ఎకరాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహాయంతో అడవిని తయారుచేద్దాం. పచ్చని చెట్టు - ప్రగతికి మెట్టు అనే నినాదంతో టీడీపీ పాలనలో పచ్చదనాన్ని అభివృద్ధి చేశాం. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెట్టు, పుట్ట, కొండలు అనే తేడా లేకుండా సర్వనాశనం చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరూ ప్రజలకు సేవకులమని గుర్తుంచుకోవాలి. సేవతోనే సంతృప్తి, గుర్తింపు లభిస్తాయి. ఆ దిశగా అందరూ పనిచేయాలని' అచ్చెన్న కోరారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేపీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కింజరాపు హరివర ప్రసాద్, కొర్ను నాగార్జున ప్రతాప్, మెండ దాసునాయుడు, పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు



మొక్కను నాటుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉచిత ఇసుక మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి

- గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

కలెక్టరేట్, ఆగస్టు 30: రాష్ట్రంలో ఉచిత ఇసుక నూతన విధానాన్ని సెప్టెంబరు 11 నుంచి అమలు చేయనున్న సందర్భంగా నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. ఇసుక విధానంపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయం నుంచి మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18005994599తో పాటు డీఎంజీపీఎస్ఏఎస్‌డీ కంప్లైంట్స్ యాహూ డాట్ కామ్ మెయిల్‌ను ప్రజలు వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. దాని ప్రారంభానికి ముందస్తుగా అవసరమైన కార్యకలాపాల వివరాలను తెలిపారు. ఇసుక నిర్వహణకు సంబంధించిన అంశాలపై సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించాలని సూచించారు. అనంతరం ఇసుక రవాణా ధరలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి గనులశాఖ ఏడీలు సత్యనారాయణ, ఫణిభూషణ్‌రెడ్డి, ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, నీటిపారుదల ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా వస్తున్నారు.. అలా పోతున్నారు..



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

- ఏడాదిన్నరలో ఆరుగురు పీవోల మార్పు
- విధుల్లో కుదురుకునేలోపే బదిలీ వేటు వేస్తున్న వైనం
- ఇలా అయితే సమస్యలు పరిష్కారమయ్యేదెలా?
- ఆందోళనలో రెండు జిల్లాల గిరిజనులు
- ఇదీ సీతంపేట ఐటీడీఏలో పరిస్థితి

(మెళియాపుట్టి)

సీతంపేట ఐటీడీఏకు ఏడాదిన్నరలో ఆరుగురు ప్రాజెక్టు అధికారులు మారారు. ఇలా విధుల్లో చేరడం.. అలా బదిలీపై వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. విధుల్లో కుదురుకునేలోపే వారిపై బదిలీ వేటు పడుతుంది. వచ్చిన వారు వచ్చినట్లే వెళ్లిపోతుండడంతో ఐటీడీఏపై పర్యవేక్షణ కరువైంది. ఏ సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలు, 1,498 గ్రామాలు ఉన్నాయి. సుమారు 1.60 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. జిల్లాల పునర్విభజనతో సీతంపేట ఐటీడీఏ ఉన్న పాలకొండ నియోజకవర్గం పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయింది. కానీ, ఐటీడీఏను మాత్రం అటు మన్యం.. ఇటు శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. శ్రీకాకుళం జిల్లాలో 16 గిరిజన ఉపప్రణాళిక మండలాలు ఉన్నాయి. అయితే, ఏడాదిన్నర కాలంలో ఐటీడీఏకు నలుగురు పీవోలు మారడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేసేలోగా వారు బదిలీ అవుతుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. 2023 ఫిబ్రవరిలో పీవోగా పని చేసిన సీహెచ్ శ్రీధర్‌ను అప్పటి వైసీపీ ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో నవ్యను పీవోగా నియమించింది. ఆమె ఏడాది పాటు విధులు నిర్వహించారు. ఈ ఏడాది ఎన్నికల సమయంలో ఆమెను బదిలీ చేసి కల్పనాకుమారిని నియమించారు. అయితే ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే కారణంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమెను విధుల నుంచి తప్పించారు. కొద్దిరోజులకే సుబమ్‌బన్సల్ పీవోగా బాధ్యతలు చేపట్టారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సుబమ్‌బన్సల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో నంద్యాల సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డిని పీవోగా నియమించింది. ఈయన బాధ్యతలు చేపట్టి వారం రోజులు తిరగకముందే మళ్లీ తూర్పుగోదావరి సబ్‌కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం పాలకొండ ఆర్డీవోగా పనిచేస్తున్న రమణను ఇన్‌చార్జి పీవోగా నియమించారు. ఇలా ఏడాదిన్నరలో ఆరుగురు పీవోలు మారారు.

పర్యవేక్షణ కరువు..

పీవోలు ఎప్పటికప్పుడే మారుతుండడంతో అధికారులు, ఉద్యోగులపై పర్యవేక్షణ కరువైంది. దీంతో వారు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆశ్రమ వసతి గృహాల్లో సైతం విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు కావడం లేదు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో అవినీతి జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కొంతమంది ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఐటీడీఏలో విధులు నిర్వహిస్తుంటారు. అయితే, పర్యవేక్షణ లేకపోవడంతో వీరంతా వారానికి మూడు రోజులే విధులకు హాజరవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పనులు చేయకుండానే కొంతమంది వైసీపీ నాయకులు బిల్లులు చేయించుకుంటున్నా పట్టించుకునే నాథుడు కనిపించటం లేదు.

ఇటువైపు రావట్లే..

జిల్లాల విభజనకు ముందు సీతంపేట ఐటీడీఏ పీవోగా ఎవరున్నా వారు తమ పరిధిలోని 20 మండలాల్లో ఆకస్మిక తనిఖీలు చేసేవారు. సక్రమంగా పని చేయని అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకునేవారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించేవారు. అయితే, జిల్లాల విభజనతో ఐటీడీఏ మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి పీవోలు ఇటువైపు కనిపించడం మానేశారు. జిల్లాలోని 16 గిరిజన ఉపప్రణాళిక మండలాలను పట్టించుకోవడం లేదు. ఎప్పుడో చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. దీంతో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించడంతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కరువైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్పందించి శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏను మంజూరు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

జిల్లాకు ఐటీడీఏను ప్రకటించాలి..

శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పక్క జిల్లాలో ఉన్న సీతంపేట ఐటీడీఏలో అసలు ఏమి జరుగుతుందో మాకు తెలియడం లేదు. పీవోలుగా వస్తున్నవారు మా గ్రామాల వైపు రావడం లేదు. దీనివల్ల నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి జిల్లాకు ఐటీడీఏను ప్రకటించాలి.

-బైరిశింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

జిల్లా ఎక్సైజ్ శాఖలో కలకలం

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఉలికిపాటు
- ట్రాన్స్‌పోర్ట్ చార్జీల అక్రమాలపై అంతర్గత విచారణకు ఆదేశించిన ఎక్సైజ్ డైరెక్టర్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లా ఎక్సైజ్ శాఖలో కలకలం రేగింది. ఎచ్చెర్లలోని మద్యం బాట్లింగ్ యూనిట్‌లో జరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ చార్జీల అక్రమాలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన 'వామ్మో.. స్కెచ్ పెద్దదే!' కథనంతో ఆ శాఖ అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. ఆ శాఖలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక స్థాయి అధికారి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఇప్పటికే ప్రొహిబిషన అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేరినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతోపాటుగా 'ఆంధ్రజ్యోతి' కథనం కూడా డైరక్టర్‌కు చేరడంతో అంతర్గత విచారణకు ఆయన ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఎక్కడ దొంగలు అక్కడే గుప్‌చుప్ అన్నరీతిన మౌనం వహిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీల అక్రమాలకు తాత్కాలికంగా కళ్లెం వేసి, డ్రైవర్లకు బకాయిలు చెల్లించి తమ తప్పు లేదని నిరూపించేందుకు తంటాలు పడుతున్నారు. ఈ మేరకు కీలక అధికారితో పాటు అక్రమాలకు చేయూతగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒక నిర్ణయానికి వచ్చేసినట్లు సమాచారం. త్వరలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ విచారణ దర్యాప్తు నివేదిక వెల్లడైతే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి.

ఐటీడీఏ ఆధ్వర్యంలో 5న జాబ్‌మేళా

అరసవల్లి, ఆగస్టు 30: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న సీతంపేట పీఎంఆర్సీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పీవో పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ కంపెనీలో 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేస్తామని చెప్పారు. పదో తరగతి పాసై, ఇంగ్లీషు చదవడం వచ్చిన 18 నుంచి 30 ఏళ్ల పురుషులు, స్త్రీలు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15,800 జీతం, అదనంగా ఇన్సెంటివ్, నెలకు 22 పనిదినాలు, రోజుకి 10 గంటల పని ఉంటుందని చెప్పారు. ఎంపికైన వారు నెల్లూరు సమీపంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 98851 08092 నెంబరును సంప్రదించాలని సూచించారు.

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▼ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

కోర్సులు- స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్‌ఆర్‌ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్.

DIKSUCHI
దిక్సూచి



ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురి కాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.

బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫియర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క ఛాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడుగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిధి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ని. ఆర్ట్ ఫిల్మ్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్ళీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయ రాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.

వైసీపీ హయాంలో పర్యావరణానికి విఘాతం

● పచ్చదనాన్ని పెంపొందిద్దాం
● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క మొక్క నాటకపోగా ఉన్న వాటిని నాటి సీఎం జగన్ పర్యటనల్లో నరికి పచ్చదనాన్ని, పర్యావరణానికి విఘాతం కలిగించారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం సుబ్బారావుపేట గ్రామంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రాంత్రాలు సస్యశ్యామలం అయ్యేలా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తన వద్దకు వచ్చే వారు పుష్పగుచ్ఛాలు, పూలదండలు తేకుండా ఒక మొక్క ను తీసుకువస్తే తనకు సంతృప్తి నిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన వన మహోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టెక్కలి అటవీశాఖాధికారి జగదీశ్వరరావు, ఎఫ్ఎస్‌వోలు సుంకరి శ్రీనివాసరావు, త్రినాథనాయుడు, చల్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హరి వరప్రసాద్, మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, కర్రి అప్పారావు, సంబాళ శ్రీనివాస్, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: మొక్కను నాటుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నాటిన మొక్కలను సంరక్షించాలి: ఎమ్మెల్యే బగ్గు



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి: వనం-మనం పేరుతో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మె ల్యే బగ్గురమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి జూనియర్ కళాశాల ప్రాం గణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏపీవో రమణ, ఎంపీడీవో ఉషశ్రీ, సూపరింటెండెంట్ బలగ ప్రకాష్, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపీటీసీ కుమారి, నేతలు ఎంవీనాయుడు, రాంబాబు, రౌతు నాయుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి: ఆర్డీవో దొర



వనమహోత్సవంలో పాల్గొన్న ఆర్డీవో సుదర్శన దొర

టెక్కలి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర అన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయం, పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శేషగిరి, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, డీఎల్పీవో రమణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పరిరక్షించాలి: ఆర్డీవో భరత్ నాయక్

పలాస: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. అటవీశాఖ-గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాల్, మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వైస్‌ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీ సాయి శిరీషా స్కూల్లో..



మొక్కను నాటుతున్న కవిటి భారతి

కాశీబుగ్గ: చినబడాం లోని శ్రీసాయి శిరీషా స్కూల్‌లో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కవిటి భారతి విద్యార్థులతో మొక్కలు నాటించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యతేజ కళాశాలల్లో..



మొక్కను నాటుతున్న పద్మజ

కాశీబుగ్గ: పట్టణంలోని సూర్య తేజ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ దానేటి పద్మజ మొక్కలు నాటారు. మొక్కలు నాట డంతో పాటు వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి మణి

కొత్తూరు: జాతీయ లోక్‌అదాలత్ సెప్టెంబరు 14న నిర్వహించనున్నామని, రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని కొత్తూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి మణి తెలిపారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సివిల్, మోటార్ వాహనాలు, మనోవర్తి, గృహహింస తదితర కేసులను పరిష్క రించు కోవచ్చన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీనిపై కక్షిదారులకు అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.అప్పారావు, న్యాయవాదులు గేదెల ఫల్గుణరావు, సుధాకరరావు, సీహెచ్ రవి, రాజు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను వెనక్కు తీసుకోవాలి

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన యూపీఎస్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఇందిరాగాంధీ కూడలిలో యూటీఎఫ్ ప్రతినిధులు నిరసన తెలిపారు. యూపీఎస్, సీపీఎస్, జీపీఎస్ స్కీంల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు జరగదని, వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.దాలయ్య, వైకుంఠరావు, గణపతిరావు, కుమార స్వామి, ధర్మారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తూరు:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించేది లేదని, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను అన్నారు. కొత్తూరు యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. డీటీ వై.అనంతకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు దండు ప్రకాశ రావు, కె.విజయకుమార్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ● **కోటబొమ్మాళి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని సీపీఎస్, యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రతినిధులు గొండు నారాయణరావు, వాసుదేవరావు, సింహాచలం పాల్గొన్నారు. ● **పాతపట్నం:** యూపీఎస్ వద్దంటూ శుక్రవారం కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ప్రతినిధులు నిరసన తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పడ్డ మోహన రావు, గేదెల కవీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తారా, లేదా?

● విశ్వసముద్ర ప్రతినిధులను నిలదీసిన గ్రానైట్ ప్రతినిధులు

టెక్కలి: గత ప్రభుత్వ విధానాల కారణంగా తీవ్రంగా నష్టపోయాం.. మమ్మల్ని అనేక రకాలుగా వేధిం చారు. రాయితీలివ్వలేదు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ అసోసియేషన్ ప్రతినిధులు విశ్వసముద్ర సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలిలో సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ చక్రవర్తి, ఇన్‌చార్జి సునీల్‌ను అసోసియేషన్ ప్రతినిధులు నిలదీశారు. బ్లాకుల కొలతల్లో వ్యత్యాసం చూపి విసిగించారని ఆరోపించారు. లోకల్ ఫ్యాక్టరీలకు లోకల్ క్వారీలకు వెళ్లే సరుకులకు సంబంధించి 25 శాతం రాయితీని గతంలో ప్రభుత్వం ప్రకటించిందని, ఆ రాయితీలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అసోసియేషన్ ప్రతినిధులు నవీన్ చౌదరి, మహేష్, అజయ్ కొల్లా, గోపి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూరియా సరఫరా

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పీఏసీయస్ కార్యాలయంలో శనివారం నుంచి యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు ఆధార్, పాస్ పుస్తకం జిరాక్స్ అందజేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి



మందస: సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

పలాస, ఆగస్టు 30: ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు బాధితులతో స్వయంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో కొన్ని ఇలా.. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో ఆర్అండ్‌బీ పరిధిలోని స్థలంలో మా అత్తవారికి చెందిన స్థలం ఎదురుగా కొందరు అమ్మవారి గుడి కడుతున్నారని, దీనివల్ల మాకు ఎంతో నష్టం వాటిల్లుతోందని పలాసకు చెందిన యు.పాండు రంగారావు ఫిర్యాదు చేశారు. తరచూ ఈ స్థలం వద్ద వివాదం జరుగుతోందని, రెవెన్యూ ఆర్అండ్‌బీ, పోలీసు అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఎస్పీ స్పందిస్తూ.. మా శాఖాధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు. పలాస సూదికొండకాలనీకి చెందిన శివకుమార్ మాట్లాడుతూ.. తనపై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని, తాజాగా రౌడీషీట్ పెట్టేందుకు ప్రయత్నించడంతో తాను ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశానన్నారు. తనకు విముక్తి కలిగించాలని కోరారు. పొందూరు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ హోమ్‌గార్డు తనకు రూ.3 లక్షల బకాయి ఉన్నాడని, ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా తిప్పుతున్నాడని కాశీబుగ్గకు చెందిన కామేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ● **మందస/వజ్రపుకొత్తూరు:** మందస, వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్లను శుక్రవారం సాయంత్రం ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. గంజాయి, సారా, నిషేధిత పదార్థాలు రవాణా కాకుండా చర్యలు చేపట్టాల న్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. ఆయనతో పాటు సీఐ ఈశ్వరరావు, ఎస్ఐలు ఎస్‌కే ఖాదర్‌బాషా, రామారావు తదితరులున్నారు.

వలస వెళ్లిన వారి పేర్లతో మస్తర్లు

మెళియాపుట్టి: గ్రామాల్లో లేనివారి పేర్లతో ఉపాధి పనులకు తప్పుడు మస్తర్లు వేసి సిబ్బంది నిధులు కాజేశారని ఇలాయిపురం సర్పంచ్ గవిరేష్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదికను నిర్వహించారు. విశాఖపట్నంలో ఉంటున్న మామిడి రాము అనే వ్యక్తికి రేషన్ కార్డులు ఉన్నా ఇక్కడ పనులు చేసినట్లు చూపించి తప్పుడు మస్తర్లు వేశారని, సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసి తప్పుడు తీర్మానాలు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనికి డ్వామా పీడీ చిట్టిరాజు స్పందిస్తూ.. దీనిపై మరోసారి ప్రత్యేకంగా దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ప్రజావేదికను తూతూమంత్రంగా నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. కార్యక్ర మంలో హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఏపీడీ మురళికృష్ణ, విజిలెన్స్ అధికారి రామారావు, తహసీల్దార్ ఎస్.హనుమంతురావు, ఎంపీడీవో చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ కల్తీపై ఆందోళన

నరసన్నపేట: పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో డీజిల్‌లో వర్షపు నీరు కలిసి కల్తీ జరిగిందని, దీంతో తన ఆటో సీజ్ అయిందని ఆటో యజమాని బంకు వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టాడు. గురువారం సాయంత్రం పెట్రోల్ బంకులో రూ.500 డిజిల్‌ను ఆటోలో వేయించానని, అయితే తిలారు వెళ్లే సరికే ఆటో ఆగిపోయిందని తిలారు ఆర్ఎస్‌కు చెందిన కృష్ణ ఆవేదన వ్యక్తంచేశాడు. శుక్రవారం మెకానిక్‌కు చూపెడితే డీజిల్ కల్తీ కావడంతో ఆటో స్టార్ కాలేదని చెప్పాడన్నారు. అయితే ఆటోలో డిజిల్ కల్తీకి మాకు ఏటువంటి సంబంధం లేదని ఏంచేసుకుంటారో చేసుకోండని బంకు యాజమాని చెప్పడంతో మరికొందరు ఆటో డ్రైవర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. డిజిల్ కల్తీపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తిలారు ఆర్ఎస్ ఆటో యూనియన్ నాయకులు తెలిపారు.

రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి

టెక్కలి: రైతులకు అవసరం మేరకు ఎరువులను సచివాలయాల ద్వారా సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు సంబూరు షణ్ముఖరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ దిలీప్ చక్రవరికి రైతు సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం యూరియా రైతులకు సకాలంలో అందించకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో బగాది వాసుదేవరావు, గంఢ్రేటి నారాయణరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే: ఆర్డీవో

పలాసరూరల్/కాశీబుగ్గ: స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లింగ నిర్ధారణ చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉపజిల్లా స్థాయి అధికారులతో లింగనిర్ధారణ, స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. అనంతరం పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీ లించారు. పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.సూర్యకళ, వైద్యులు, పోలీసు అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. ● **జలుమూరు:** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సుజాత తెలిపారు. కరకవలస గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడైనా, మగైనా వివక్ష చూపించడం మంచిది కాదన్నారు.

శ్రీముఖలింగంలో డెంగ్యూ కలకలం



లక్ష్మీనారాయణ కుటుంబం నుంచి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

జలుమూరు: శ్రీముఖలింగంలో డెంగ్యూ పాజిటివ్ బయటపడడంతో ప్రజలు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి వీధిలోనూ నలుగురైదుగురు విష జ్వరాలతో బాధపడుతుండగా తాజాగా పొందర వీధికి చెందిన పైడి లక్ష్మీనారాయణకు డెంగ్యూ పాజి టివ్‌గా రాపిడ్ పరీక్షలో తేలింది. దీంతో అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అప్రమత్తమై సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. ఎంతమందికి డెంగ్యూ సోకిందోనని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై అచ్యుతాపురం వైద్యాధికారి పి.సుజాత దృష్టికి తీసుకెళ్లగా పైడి లక్ష్మీనారాయణకు రాపిడ్ పరీక్షలో డెంగ్యూ పాజిటివ్ కనిపించిందని, పూర్తిస్థాయి నిర్ధారణకు శ్యాంపిళ్లను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి పంపామన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరణకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులివ్వరా?

● ఇంజనీరింగ్ అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ వజ్జ బాబూరావు

పలాస, ఆగస్టు 30: పట్టణంలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులివ్వకుంటే ఎలా అని, వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించవద్దని పలువురు కౌన్సిలర్లు ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఛైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసి పల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, గుజ్జు జోగారావు, గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి, డొక్కరి తులసీ మాట్లాడుతూ.. చేసిన పనులకు ఎందుకు బిల్లులివ్వడం లేదని ప్రశ్నించారు. ఏ మేరకు బిల్లులు చెల్లింపులు చేయాలని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి ఏఈ అవినాష్ సమాధానమిస్తూ.. నెలరోజుల్లోగా బిల్లులు ఇవ్వాల్సి ఉందని పేర్కొనగా అయితే ఎందుకు ఇవ్వడం లేదని వారు నిలదీశారు. రూ.కోట్లలో కాంట్రాక్టర్లకు బకాయిలు ఉన్నాయని, 2021లో జరిగిన పనులకు కూడా బిల్లులివ్వకుంటే కాంట్రాక్టర్లు వడ్డీలు కట్టలేక ఆత్మహత్య లు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 26న 'పలాసలోనా వద్దే వద్దు' అనే శీర్షికతో వచ్చిన కథనంపై సమావేశంలో చర్చించారు. కాలువల్లో పూడికలు తీత కార్యక్రమం అన్ని వార్డుల్లోనూ చేపట్టాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ కోరారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న ఒప్పంద సిబ్బందికి 14 నెలలుగా వేతనాలివ్వడం లేదని, దీంతో పాటు కౌన్సిలర్ల గౌరవ వేతనం కూడా నిలుపుదల చేశారని బాబూరావు సమావేశంలో ప్రస్తావించారు. దీనికి ఛైర్మన్ బళ్ల గిరిబాబు సమాధానమిస్తూ.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఒక వ్యక్తి పెడుతున్న కేసుల వల్లే బిల్లుల పెండింగ్, అభివృద్ధి జరగడం లేదని, ఆయన చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవద్దంటూ తీర్మానం చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తాను ఇక్కడ పనిచేసిన కాలంలో వివాదంలో ఉన్న గాంధీనగర్ రోడ్డు సమస్య పరిష్కరించా మనే తృప్తి మిగిలిందన్నారు. ఇక్కడ పనిచేయాలంటే అధికారులు భయపడుతున్నారన్నారు.

టీడీపీతోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం

కోటబొమ్మాళి: నాయీ బ్రాహ్మణులను గుర్తించి వారికి అండగా ఉన్నది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ పి.భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం పెంపు, పాలక మండలిలో సభ్యులుగా నియమిస్తామని సీఎం ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు.

6న గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూ

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టులకు సెప్టెంబరు 6న ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఏపీ సెట్, నీట్ లేదా పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, అన్ని సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు.

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

టెక్కలి: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఉదయం టెక్కలి మండలం రావి వలసలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ఎల్‌నాయుడు తెలిపారు. పింఛన్ల పంపిణీ, సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, కార్యకర్తలు, అభిమా నులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వాహనాల ముమ్మర తనిఖీ

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎన్.సాయి మాట్లాడుతూ.. సరిహద్దులో గంజాయి, మద్యం, సారా, గుట్కా వంటి నిషేధిత ఉత్పత్తుల అక్రమ రవాణాను నిలువ రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం

నందిగాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గిరిజనులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో టి.రాజారావు కోరారు. శుక్రవారం హర్షబాడ పంచాయతీ పెద్దగురువూరులో పీఎం జన్‌మన్‌లో భాగంగా పీవీటీజీ పథకాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో వివిధ పథకాలను వివరించారు. గ్రామాలకు అవసరమైన సదుపాయాలపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఎం కె.జాంబ వతి, ఆర్ఐ పి.కిరణ్, సర్పంచ్ ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే పీఎంజన్‌మన్ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. పెద్దసున్నాపురం, పెద్దలోగిడి గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి పథకం లక్ష్యాలను వివరించారు. కార్యదర్శులు సుహాసిని మహాపాత్రో, ఆర్.షణ్ముఖరావు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

వారణాసిలో కూచిపూడి ప్రదర్శనకు విద్యార్థినులు

హరిపురం: వారణాసిలో ఆదివారం జరగనున్న ప్రపంచ కూచిపూడి నృత్య ప్రదర్శనకు హరిపురానికి చెందిన శ్రీసాయి మోహర్ నాట్య కళాక్షేత్రం విద్యార్థినులు ఎంపికైనట్లు నాట్య గురువు నారయణశెట్టి శైలజ తెలిపారు. ఈ మేరకు త్రయంతి, వాసిన్, మోక్ష, జాహ్నవి, విమల గీత శుక్రవారం బయలుదేరి వెళ్లారు. వారిని పలువురు స్థానికులు అభినందించారు.

విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి చూపాలి

నరసన్నపేట: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా దినోత్సవాన్ని యంగ్ మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ (వైసీఎంఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గొద్దు చిట్టిబాబు, టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.8.67లక్షలు

పాతపట్నం: శ్రీ నీలమణిదుర్గ ఆలయ ఆదాయం 70 రోజులకు గాను రూ.8,67,616 వచ్చిందని ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించారు. అలాగే నీలకంఠేశ్వర ఆలయానికి ఆరు నెలలకు రూ.20,864 ఆదాయం లభించిందన్నారు. ఈవో మనస్వి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: వనమహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్



ఆమదాలవలస: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

పర్యావరణాన్ని పరిరక్షించండి

● జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం

పర్యావరణాన్ని పరిరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా వనం-మనం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు.

● **ఇచ్ఛాపురం:** కార్యాలయాల ఆవరణ, పబ్లిక్ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ పార్క్‌లో, తహసీల్దార్‌కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలుదాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, కాళ్ల ధర్మారావు పాల్గొన్నారు.

●**ఆమదాలవలస:** ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా వనాలను సంరక్షించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన వనమహోత్సవంలో వన సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ వి.బాలాజీ ప్రసాద్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వాసుదేవరావు, జనసేన నియోజకవర్గ బాధ్యుడు పేడాడ రామ్మోహన్, టీడీపీ నాయకులు టి.గీత, టి.విద్యాసాగర్, ఎం.రమేష్, టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** ఉపాధి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మొక్కలను చెరువు గట్టుపై నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. దేవరవలసలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, కుదిరెళ్ల బుజ్జి, దాసు, వెంకటరావు, ఎంపీడీవో నిశ్చల పాల్గొన్నారు.

●**కంచిలి:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు.కంచిలి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీవో వి.నీరజ, ఎంఈవోలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు, ఏపీవో ధనుంజయ పాల్గొన్నారు.

●**అరసవల్లి:**శ్రీకాకుళం జడ్పీకార్యాలయ ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఉద్యోగులతో కలిసి మొక్కలు నటారు. కార్యక్రమంలో సీఈవో వేంకటేశ్వరరావు,ఉపసీఈవో వెంకటరామన్ పాల్గొన్నారు.

●**లావేరు:** గురుగుబిల్లి ప్రాథమిక పాఠశాల, లావేరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వై.జోగారావు, ఎంఈవోలు లండ ఈశ్వరరావు, ఎం.మురళీకృష్ణ మొక్కలు నాటారు. లావేరు జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం జగన్నాథరావు,మురపాక కేజీబీవీ ఆవరణలో ప్రత్యేకాధికారి సుధ మొక్కలు నాటారు.

● **గార:** గార మండలపరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీపీ గొండు రఘురామ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమణయ్య, తహసీల్దార్, ఎస్.రమణారావు, జేఈ నారన్నాయుడు పాల్గొన్నారు.

●**సరుబుజ్జిలి:**మండలంలోని కొత్తకోట, తెలికిపెంట సర్పంచ్‌లు సురవరపు జగదీష్, నందివాడ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్, టీడీపీ నాయకులు దవళ సింహాచలం,రామారావు, రొట్టవలసలో తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

●**కవిటి:**రాజపురంలో ప్రజాప్రతినిధులు, జగతిలో జనసేన నేత ఎస్.ప్రసాద్,కవిటిలో సర్పంచ్ పి.లక్ష్మణరావు ఆధర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, టీడీపీనాయకులు బి.రమేష్, మణి చంద్రప్రకాష్, పి.కృష్ణారావు, పి.సంతోష్, ఎస్‌వీ రమణ,సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు.

●**పొందూరు:** మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, ఎంపీడీవో హరిహరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎంపీటీసీలు బాడాన గిరి, అనకాపల్లి వాణి, వి.పద్మావతి, ఏపీవో శ్రీనివాసరావు, శ్రీనివాసరావు కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



లావేరు: మొక్క నాటుతున్న అధికారులు



కవిటి: రాజపురంలో మొక్క నాటుతున్న అధికారులు



పొందూరు: మొక్క నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి



ఆదినారాయణ(ఫైల్)

పలాస: నెమలినారాయణపురం సమీపంలో జాతీయరహదారిపై స్థానిక రాజమ్మ కాలనీకి చెందిన గొర్రెల కాపరి కడమట ఆదినారాయణ (54) మృతిచెందాడు. శుక్రవారం ఉదయం గొర్రెలను మేపుతూ హైవే దాటుతుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్ కోరారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నరసన్నపేట: పట్టణంలో ఈనెల 28న బి.అనూరాధ ఆత్మహత్యకు వరకట్న వేధింపులే కారణమని దర్యాప్తులో వెల్లడైందని కాశీబుగ్గ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసులో మృతురాలి భర్త శ్రావణ్ కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఇదిలా ఉండగా సెప్టెంబరు 7 నుంచి నిర్వహించనున్న వినాయక నవరాత్రి మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే ధ్యేయం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందించడం ధ్యేయమని పశ్చిమబెంగాల్‌కుచెందిన రాజ్కుమార్ హాతో తెలిపారు. పశ్చిమబెంగాల్ నుంచి చేస్తున్న పాదయాత్ర శుక్రవారం శ్రీకాకుళం చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళలపై అరాచకాలు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు.

ఆర్థిక స్థోమత లేనివారికి న్యాయ సహాయం

గుజరాతీపేట: ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలు, ఖైదీలకు న్యాయ సహాయం కోసం సంప్రదిస్తే రుసుము లేకుండా న్యాయవాదులను నియమించి వారి తరుపున వాదించేందుకు న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్‌సీఎం జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, ఎం.శశికళ, ఎం.శాంతి పాల్గొన్నారు.

నైట్‌అవుట్ల అలవెన్స్ పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

అరసవల్లి: ఆర్టీసీ ఉద్యోగులకు నిలిపివేసిన నైట్ అవుట్ల అలవెన్స్‌లను పునరుద్ధరించాలని, ఏరియర్ బిల్లులను ట్రెజరీ అధికారులు సకాలంలో పారదర్శకంగా చెల్లించాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకాకుళంలోని కాంప్లెక్స్ ఆవరణలో యునియన్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య, వరుదు దర్మారావు, ఆర్.సింహాచలం, లక్ష్మణరావు, కెటి.రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలపై సర్వే

కంచిలి: గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పించడమే ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ఉద్దేశమని ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. శుక్రవారం మండలంలోని నువాగడ పంచాయతీలో గిరిజనులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా గిరిజనుల మౌలిక సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాంప్రసాద్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన తమ్మినేని

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: వైసీపీపాలనలో వ్యవస్థలను భ్రష్టుపట్టించిన ఘనత మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకే దక్కిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 80 రోజుల్లోనే సీఎం చంద్రబాబునాయుడు చాలా మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. పొందూరు, తొగరాం డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలను త్వరలో నిర్మిస్తానని తెలిపారు. పట్టణంలోని డిగ్రీకళాశాల అభివృద్ధి పనులకు రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయన్నారు. తమ్మినేని సీతారాం జలజీవన్‌మిషన్ పనుల పేరిట కాంట్రాక్టర్ల దగ్గర నుంచి డబ్బులు దండుకున్నారని, ఆ పనులు పూర్తి కాకుండా మిగిలిపోయాయని, వాటిని కూడా పూర్తి చేస్తానన్నారు.

రక్తసేకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్

అరసవల్లి : రక్తసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలో రెడ్‌క్రాస్ సమావేశానికి హాజరయ్యారు. వన మహోత్సవంలో భాగంగా బ్లడ్‌బ్యాంకు ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది రెడ్‌క్రాస్ ద్వారా 50వేల మొక్కలు నాటామని, ఈ ఏడాది ఎన్ని మొక్కలు నాటనున్నారో ప్రణాళిక రూపొందించాలని, కావలసిన మొక్కలు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రోజుకు 300 యూనిట్ల రక్తం సేకరించాలని సూచించారు. రెడ్‌క్రాస్ సేవలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో నిర్వహించిన రక్తదానం చేసిన విద్యార్థినులను అభినందించి, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాల వివరాలను రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జగన్మోహనరావు, త్రినాథరావు, పుష్పలత, నిక్కు అప్పన్న, కెల్లి చిన్నబాబు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాసరావు, జి.రమణ, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థినిని అభినందిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అన్న క్యాంటీన్‌కు విరాళం

అరసవల్లి: టీడీపీ నాయకుడు వెంకటేష్ అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.20,000లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ద్వారా ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బాలకృష్ణ నటప్రస్థానం ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా నందమూరి బాలయ్య, మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో పీఎంజే బాబు, పొంద్రంకి శంకర్, మాదారపు డేవిడ్, బాలయ్య ఫాన్స్ కూన రామారావు, సురేంద్ర, భాస్కర్, సురేష్, రాజు, ప్రదీప్, మహేష్, మణి, తారక్ వెంకీ, మోహన్ పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌కు సంబంధించిన విరాళాన్ని అందజేస్తున్న అచ్చెన్నాయుడు

జిల్లాలో 28 డెంగ్యూ కేసులు

● జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి ● డీఎంహెచ్‌వో మీనాక్షి

కంచిలి: జిల్లాలో 28 డెంగ్యూ కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. శుక్రవారం కంచిలి పీహెచ్‌సీలో వైద్యులు, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమీక్షించారు. సీజనల్ జ్వరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జ్వరాల సర్వేకు సంబంధించి ఈ ఏడాది ఇప్పటి వరకు 3,70,000 రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. కంచిలి మండలంలోని జాడుపుడికి చెందిన బాలిక లాబాల ఝాన్సీ మృతికి గల కారణాలను ఆమెకు చికిత్స అందించిన వైద్యులతో మాట్లాడినట్లు తెలిపారు. బాలికకు చికిత్స నిర్వహించిన ఆర్ఎంపీపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని చెప్పారు.అనంతరం ఝాన్సీ కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి సత్యనారాయణ, డివిజినల్ మలేరియా నివారణాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, ఆసుపత్రి వైద్యులు హరిబాబు, నాగేంద్ర పాల్గొన్నారు.



కంచిలి: మాట్లాడుతున్న మీనాక్షి

జ్వరాలపై ఇంటింటా సర్వే

ఎచ్చెర్ల: పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ఎన్.శేషగిరి తెలిపారు. జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే అక్కడికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ వెళ్లి రక్త నమూనాలు సేకరించి అవసరమైన చికిత్స అందజేస్తుందని పేర్కొన్నారు. పెయ్యలవానిపేటలో హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు, సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు.

మెరుగైన సేవలందించాలి

● వెలగాడలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పర్యటన

జి.సిగడాం: రోగులకు మెరుగైన సేవలందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వెలగాడలో పర్యటించారు. డయేరియా బారిన పడి మృతి చెందిన చిన్నారి రాజేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన గ్రామంలో పలు వీధుల్లో పరిశీలించి అధికారులతో మాట్లాడారు. డయేరియా తగ్గుముఖం పట్టే వరకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వ , ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉన్న రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నిశ్చల, వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్ఠశర్మ, ఏఈ భాగ్యలక్ష్మి ఈవోఆర్డీ శ్రీనివాసులు, ఈసీ పురుషోత్తమరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, నాయకులు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, కురిరెళ్ల బుజ్జి, టంకాల మౌళీశ్వరరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

మరో మూడు డయేరియా కేసులు

మండలంలోని వెలగాడలో శుక్రవారం మరో మూడు డయేరియా కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్ఠాశర్మ తెలిపారు.ఈ మేరకు పెద్ది కన్నమ్మ, పిడుగు సాయిలను రాజాం సీహెచ్‌సీకి తరలించగా, ధర్మవరపు తవిటిరాజు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో చికిత్స పొందున్నాడు. కొలు నాగమ్మ, ఎం.సరస్వతిల పరిస్థితి విషమంగా ఉండడంతో రాజాం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం నమోదైన మూడు కేసులతో రోగుల సంఖ్య 34కి చేరింది. వీరిలో వివిద ఆసుపత్రుల నుంచి ఐదుగురు రోగులు డిశ్చార్జి కాగా, మరో 11 మంది రికవరీ అయ్యారని వైద్యాధికారులు తెలిపారు.



గుజరాతీపేట: శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



సోంపేట : నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

యూపీఎస్‌ను రద్దుచేయాలి

● తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో యూటీఎఫ్ నిరసన

సోంపేట:కేంద్రప్రభుత్వం తీసుకువచ్చినఏకీకృత పెన్షన్ విధానాన్ని(యూపీఎస్) రద్దుచేయాలని యూటీఎఫ్ డిమాండ్‌చేసింది. ఈ మేరకు సోంపేట తహసీల్దార్ కార్యాలయంవద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు లండ బాబూరావు, గుంట కోదండరావు, దొరబాబు, సాప కూర్మారావు, మురళీనాయక్, రవికుమార్ పాల్గొన్నారు.

● **గుజరాతీపేట:** యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, జీపీఎఫ్‌ను రద్దు చేయాలని, సీపీఎస్ విధానం ఉపసంహరించుకోవాలని, పాత పెన్షన్ పథకం విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు చౌదరి రవీంద్ర తదితరులు నిరసన తెలిపారు.

● **నరసన్నపేట:**పాత పెన్షన్ పథకం విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు.ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

● ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన భక్తులు

జిల్లాలో శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని పెద్ద జగన్నాథాలయంలో కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి 1008 ముద్దమందారం, రేఖ మందారం, చామంతి, సంపెంగ, గులాబీ పువ్వలతో సహస్రనామ అర్చనలు, కుంకుమార్చనలు, పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలుచేసి అలంకరించారు.

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో గల విజయదుర్గ ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని విజయదుర్గను ధనలక్ష్మి దేవిగా అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అలంకరించారు.



ఇచ్ఛాపురం :1008 పువ్వులతో మహాలక్ష్మి అమ్మవారికి అలంకరించిన దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: విజయదుర్గను ధనలక్ష్మీదేవిగా అలంకరించిన దృశ్యం

మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీని అభివృద్ధి చేయడమే టీడీపీ ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయం వద్ద రెండు వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. నాలుగో వార్డులోని సీసీ డ్రెయిన్ల పనులకు భూమి పూజచేశారు.కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ వెంకటరావు, కమిషనర్ ఎన్.రమేష్,వైస్ చైర్‌పర్సన్లు భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, టీడీపీ నాయకులు దర్మారావు పాల్గొన్నారు.

●ఎన్‌టీఆర్ అన్న క్యాంటీన్ పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదేశించారు. మునిసిపల్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న అన్నక్యాంటీన్ పనులను పరిశీలించారు.

నీరు-చెట్టు బిల్లులు చెల్లించాలి

ఎచ్చెర్ల: నీరు -చెట్టు పనులకు సంబంధించిన బిల్లులు మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలని టీడీపీజిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి కోరారు. ఈమేరకు మంత్రి నారాలోకేష్‌ను శుక్రవారం విశాఖపట్నంలో కలిశారు.

నవభారత్ కూడలిలో చోరీ

ఎచ్చెర్ల:కుశాలపురం సమీపంలోని నవభారత్ కూడలిలో నివాసముంటున్న సీపాన వెంకటరమణ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో కొందరు బంగారం గొలుసు, మూడు వేలు అపహరించారు.సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నారు.

నూతన సాంకేతికతతో ప్రగతి వేగవంతం

ఎచ్చెర్ల: నూతన సాంకేతికత, ఆధునిక ఆవిష్కరణలతో పలు రంగాల్లో ప్రగతి వేగవంతమైందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ హ్యూమన్ రీసోర్ మేనేజ్‌మెంట్ అన్న అంశంపై జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం లండన్ లియోడన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెందిన ఆర్కిటెక్ వింగ్ సీనియర్ అధికారి తిర్లంగి హరిబాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పలుకంపెనీలు రానున్న రోజుల్లో మానవ వనరుల సమర్థవంతంగా వినియోగానికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ హెటిరో ఫార్మా ఎల్‌అండ్ ఓడీ హెడ్ ఎస్.ఆనందరెడ్డి, హైదరాబాద్ విల్కోసోర్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ హెచ్‌ఆర్ జీఎం కె.వెంకట సత్యశ్రీ కుమార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ విభాగం బీఎస్‌వో చైర్మన్ డాక్టర్ వి.తులసీదాస్, బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు బీఎస్‌వో చైర్మన్ ప్రొఫెసర్ టి.కామరాజు, సెమినార్ కన్వీనర్ అచ్యుతరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణకు అధికారి నియామకం

ఆంధ్రజ్యోతి- శ్రీకాకుళం:ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుతీరును పర్యవేక్షించేందుకు జిల్లాకు ఒక్కో ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా రాష్ట్రమైనింగ్ అండ్ జియాలజీ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌నుజిల్లాకు నియమిస్తూశుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును జిల్లాకు వచ్చి ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షిస్తారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం:మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం ఉదయం 11గంటలకు మునిసిపల్ సాధారణ, అత్యవసర సమావేశం జరగనుందని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లతోపాటు అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలని కోరారు.

రేపు సీపీఎస్‌పై ఏపీటీఎఫ్ ధర్నా

ఇచ్ఛాపురం : రాష్ట్రంలో సీపీఎస్ ప్రవేశపెట్టి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆదివారం పాత తాలూకా కేంద్రాల్లో నిరసనకార్యక్రమాలు నిర్వహించాలని తమ సంఘం పిలుపునిచ్చిందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.చాణిక్య తెలిపారు. ఇచ్ఛాపురం, కవిటి మండలాల సీపీఎస్ ఉద్యోగులు ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నిరసనను విజయ వంతం చేయాలని కోరారు.

2న వైఎస్ వర్ధంతి

శ్రీకాకుళం అర్బన్: వైసీపీ జిల్లా కార్యాలయంలో వచ్చేనెల రెండో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులుపాల్గొనాలని కోరారు.

3న శ్రీకాకుళంలో జాబ్ మేళా

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోగల నోడల్ రిసోర్స్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు మూడో తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాలప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాకు డాక్టర్ రెడ్డీస్, అపోలో ఫార్మా, యాకో హమా వంటి కంపెనీలు హాజరుకానున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు రెస్యూమ్‌తోపాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, అర్హత గల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

పొందూరు:పొందూరుప్రభుత్వ డిగ్రీకళాశాలలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఉదయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు ఐదో తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, 9న ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ప్రసూతి సెలవులు

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ గెస్ట్‌ఫాకల్టీకి జీతంతో కూడిన ప్రసూతి సెలవు వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణలు శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీలో మహిళలకు 180 రోజులు మెటర్నిటీ సెలవులు, పురుషులు 15 రోజుల పెటర్నిటీ సెలవులను మంజూరుచేసినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఆర్డర్ అందజేత

ఆమదాలవలస: తోటాడ గ్రామస్థుడు కలివరపు రామకృష్ణ గుండె సంబంధిత వ్యాధి బారినపడడంతో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన రూ.15 లక్షలు ఆర్డర్‌ను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ అందజేశారు.